సాక్షి
చిత్తూరు
శుక్రవారం । 6 । సెప్టెంబర్ । 2024



అంగన్‌వాడీ వర్కర్ల ధర్నా

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఐసీడీఎస్ పీడీ నాగశైలజకు వినతి పత్రమిచ్చారు.



పోలీసుల కవాతు

వి.కోట: ఇరువర్గాల ఘర్షణ నేపథ్యంలో 144 సెక్షన్ విధించారు. పరిస్థితులు సాధారణ స్థితికి రావడంతో గురువారం సీఐ ఆధ్వర్యంలో పోలీసులు కవాతు నిర్వహించారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. బుధవారం అర్ధరాత్రి వరకు 57,390 మంది శ్రీవారిని దర్శించుకోగా 20,628 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. కానుకల రూపంలో హుండీలో రూ.3.45 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్ల భక్తులకు సకాలంలో, టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో, ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్ల భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

న్యూస్‌రీల్

బ్రహ్మోత్సవాలు విజయవంతం చేద్దాం

– కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

కాణిపాకం: బ్రహ్మోత్సవాలను అందరూ సమన్వయంతో విజయవంతం చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. కాణిపాక వరసిద్ధుని బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో గురువారం స్థానిక ఈవో కార్యాలయ సమావేశ మందిరంలో కలెక్టర్, ఎస్పీ మణికంఠ చందోలు పలు శాఖల అధికారులతో సమీక్షించారు. ప్రధానంగా పారిశుద్ధ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని, ఆలయ పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య సమస్యలు లేకుండా చూడాలన్నారు. భక్తులకు అన్ని వసతులు, సౌకర్యాలు కల్పించాలని, వైద్య సేవలు 24 గంటలు అందేలా చూడాలని ఆదేశించారు. బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు కమాండ్ కంట్రోల్ రూమ్‌తో పర్యవేక్షిస్తామన్నారు. హోంగార్డులు, ఆలయ సిబ్బంది భక్తులతో మర్యాదపూర్వకంగా నడచుకోవాలని హితవు పలికారు. అనంతరం ఏర్పాట్లు, కమాండ్ కంట్రోల్ రూమ్ పరిశీలించారు. కార్యక్రమంలో ఈవో గురు ప్రసాద్, ఆర్డీఓ చిన్నయ్య, డీపీఓ లక్ష్మి, డీసీహెచ్ఎస్ రాజశేఖర్‌రెడ్డి, డీఎంఅండ్‌హెచ్ఓ ప్రభావతిదేవి, అగ్నిమాపక శాఖ అధికారి ప్రవీణ్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించాలి



చెకుముకి పోస్టర్ల ఆవిష్కరణలో ఎమ్మెల్యే, అధికారులు

చిత్తూరు కలెక్టరేట్ : విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలని డీఈఓ దేవరాజు అన్నారు. గురువారం జెడ్పీ సమావేశ మందిరంలో జనవిజ్ఞానవేదిక చెకుముకి పోస్టర్లను డీఈఓ, జీడీ నెల్లూరు ఎమ్మెల్యే థామస్ ఆవిష్కరించారు. డీఈఓ మాట్లాడుతూ, విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు చెకుముకి పోటీలు ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి, డీవైఈఓ చంద్రశేఖర్, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ, యూటీఎఫ్ నాయకులు సోమశేఖర్‌నాయుడు, మణిగండన్, జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలచైతన్య తదితరులు పాల్గొన్నారు.

దేశ భవిష్యత్తును నాలుగు గోడల మధ్య తీర్చిదిద్దే గురువులకు ప్రతి ఏటా సెప్టెంబర్ 5వ తేదీ ఓ పండుగే. 'గురుపూజోత్సవం'తో ఉపాధ్యాయులు సముచిత సత్కారం, గౌరవం అందుకునే రోజు కావడంతో ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తూ ఉంటారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలనలో మొదటి ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. అయితే అధికారుల నడుమ సమన్వయ లోపం మూలాన ఒకింత గందరగోళం నడుమ సాగింది. కలెక్టర్, సభాధ్యక్షత వహించవలసిన చిత్తూరు ఎమ్మెల్యే కూడా హాజరు కాకపోవడంతో ఉపాధ్యాయులు కొంత అసంతృప్తికి గురయ్యారు. మొత్తంగా చిత్తూరు, పూతలపట్టు, పలమనేరు, పుంగనూరు, కుప్పం, నగరి, జీడీ నెల్లూరు నియోజకవర్గాల నుంచి 60మంది ఉత్తమ ఉపాధ్యాయులుగా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా సన్మానం అందుకున్నారు.



హెచ్ఎం హసన్‌బాషాను సత్కరిస్తున్న జెడ్పీ చైర్మన్, జాయింట్ కలెక్టర్ తదితరులు

గురువులే మార్గదర్శకులు

- గందరగోళంగా ఉపాధ్యాయ దినోత్సవం
- కొందరికే జాయింట్ కలెక్టర్ సత్కారం
- కలెక్టర్ వస్తారని గంట పాటు ఆగిన కార్యక్రమం

చిత్తూరు కలెక్టరేట్ : గురువులే సమాజానికి మార్గదర్శకులని జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు అన్నారు. గురువారం జెడ్పీ సమావేశ మందిరంలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. తొలుత జెడ్పీ చైర్మన్, జాయింట్ కలెక్టర్ విద్యాధరి, జిల్లా అధికారులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. 9.30 గంటలకు వచ్చిన వచ్చిన జేసీ పది మంది టీచర్లను సన్మానించారు. తదుపరి మరో కార్యక్రమం ఉందంటూ 10.45 గంటల ప్రాంతంలో వెళ్లిపోయారు. మధ్యలో వచ్చిన జీడీ నెల్లూరు ఎమ్మెల్యే థామస్ తన నియోజకవర్గానికి చెందిన దాదాపు 20మంది టీచర్లను సన్మానించారు. ఆ తర్వాత ప్రత్యేక ఆహ్వానితులుగా కలెక్టర్ వస్తారంటూ గంటపాటు కార్యక్రమాన్ని నిలుపుదల చేశారు. ఎంతకూ ఆయన రాకపోవడంతో మళ్లీ కొనసాగించారు. ఆ తర్వాత తక్కిన నియోజకవర్గాల టీచర్లను థామస్‌తో పాటు జెడ్పీచైర్మన్, డీఈఓ, మేయర్ తదితరుల చేతుల మీదుగా సన్మానించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ, దేశాభివృద్ధిలో టీచర్లు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

సేవలతో జీవితాల్లో వెలుగు

జేసీ విద్యాధరి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తమ తల్లిదండ్రుల తరువాత అంతటి ప్రత్యేక స్థానం గురువుకు ఇస్తారన్నారు. సమాజంలో ఎంతో గౌరవప్రదమైన వృత్తిలో ఉన్న ఉపాధ్యాయులను గౌరవించుకునే అవకాశం రావడం చాలా అదృష్టమన్నారు. ఉపాధ్యాయులు ఇప్పటి వరకు ఎందరో విద్యార్థుల జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్ది ఉంటారని, తమ సేవలను కొనసాగించి మరెందరో జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు.

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ సేవలను స్మరించారు. గురువులు లేని సమాజాన్ని ఊహించలేమన్నారు. ఒక వ్యక్తి ఐఏఎస్, ఐపీఎస్, రాజకీయ నాయకులుగా ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి తోడ్పడే మహనీయులు గురువులు అని కొనియాడారు.





మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, ఉపాధ్యాయ దినోత్సవంలో పాల్గొన్న టీచర్లు

విద్యార్థులకు సత్ప్రవర్తన ముఖ్యం

గంగాధర నెల్లూరు ఎమ్మెల్యే మాట్లాడుతూ, విద్యార్థులు సత్ప్రవర్తన, ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లేలా టీచర్లు వారిని దిశా నిర్దేశం చేయాలన్నారు. సమాజానికి ఉపయోగపడే పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. అనంతరం నగర మేయర్ అముద మాట్లాడారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన టీచర్లకు శాలువలు కప్పి సత్కరించారు. ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మొత్తం 60మంది టీచర్ల సన్మానం అందుకున్నారు. డీఈఓ దేవరాజు,సమగ్రశిక్ష శాఖ ఏపీసీ వెంకటరమణారెడ్డి, డీఎంఅండ్‌హెచ్ఓ ప్రభావతి, డీవైఈఓ చంద్రశేఖర్, ఎంఈఓలు సెల్వరాజ్, మోహన్, టీచర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో నియామకాలు



కుమార్‌రాజా శీను రాజేంద్రప్రసాద్ పవిత్ర

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాకు చెందిన పలువురిని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అనుబంధ విభాగాల అధ్యక్షులుగా నియమిస్తూ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం నియామక పత్రాలు జారీ చేశారు. పాల ఏకరి విభాగానికి ఎంబీ.కుమార్‌రాజా, వన్నెకుల క్షత్రియ విభాగానికి హెచ్.ఎం.శీను రాజేంద్రప్రసాద్ (శీను మురుగేష్), విశ్వ బ్రాహ్మణ విభాగానికి ఎస్.ఎం. పవిత్రను నియమించారు.

ప్రజలు మెచ్చుకునేలా ఆరోగ్య సేవలు

– జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రభావతి దేవి



జూమ్ మీటింగ్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లాలో ఆరోగ్య కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రభావతి దేవి ఆదేశించారు. చిత్తూరులోని తన కార్యాలయంలో గురువారం వికసిత్, ఏపీ 2047–ఆరోగ్య ప్లాన్‌పై జూమ్ ద్వారా సమీక్షించారు. ప్రస్తుతం అవలంబిస్తున్న ప్రైమరీ కేర్, సెకండరీ కేర్, టెర్సరీ కేర్ అన్ని ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చి ప్రజలందరూ మెచ్చుకునే ఆరోగ్య సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలు, సంక్రమణ, అసంక్రమణ వ్యాధులు, వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను, మాతా–శిశు సంరక్షణ, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం, క్షయ నిర్మూలన కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

బెస్తపల్లెలో డెంగీ కేసు

ఐరాల: మండలంలోని బెస్తపల్లెలో డెంగీ కేసు నమోదైనట్లు జిల్లా సహాయ మలేరియా నివారణ అధికారి రామచంద్రారెడ్డి వెల్లడించారు. గురువారం డెంగీ కేసు నమోదైన జ్యోతిర్మయి(11) ఇంటిని సందర్శించారు. ఇంటి ఆవరణలో నీటి తొట్టెలో ఉన్న లార్వాలను గుర్తించి నీటిని పారబోయించారు. అలాగే గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఫీవర్ సర్వే చేశారు. ఇళ్లల్లో, బయట ఉన్న నీటి నిల్వలను పరిశీలించి దోమల లార్వాలు ఉన్న నీటిని పారబోశారు. అలాగే నిల్వ ఉన్న నీటిలో అబేట్ ద్రావణాన్ని, ప్రతి ఇంటా సైఫెనిత్రిన్ మందు పిచికారీ చేయించారు. గ్రామంలో నిరుపయోగంగా ఉన్న బావిపై మూతవేయాలని పంచాయతీ సెక్రటరీ తులసీరామ్‌ను ఆదేశించారు. గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అనంతరం గ్రామంలో సర్పంచ్ మల్లీశ్వరి ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసి మాట్లాడారు. వర్షాకాలం నేపథ్యంలో దోమకాటు వలన డెంగీ, మలేరియా, టైఫాయిడ్, చికున్ గున్యా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. జ్వరం తగ్గకుంటే రక్తపరీక్షలు చేయించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. జిల్లా సబ్ యూనిట్ మలేరియా అధికారి పీరూసాహెబ్, హెల్త్ సూపర్‌వైజర్ చిన్నమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా సహాయ మలేరియా అధికారి

ఆటోలు ఢీ 11 మందికి గాయాలు

పుంగనూరు: రోడ్డు ప్రమాదంలో 11మంది గాయపడిన సంఘటన గురువారం పుంగనూరులో చోటు చేసుకుంది. వివరాలు.. మండలంలోని ఏడూరుకు ప్రయాణికులతో వెళ్తున్న ఆటోను స్థానిక సాయిబాబా గుడి వద్ద ఎదురుగా వస్తున్న ఆటో వేగంగా వస్తూ ఢీకొంది. అలాగేపెంచుపల్లెకు చెందిన గోపినాథ్ బైకునూ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఏడూరుకు చెందిన మమత, రమణమ్మ, నీలావతి, ఈశ్వరమ్మ, సుప్రియ, కళావతి, అన్వేష్, డ్రైవర్ జీవరత్నలకు తీవ్ర గాయాలయ్యాయి. గోపినాథ్‌తోపాటు అతని భార్య అఖిల, కొడుకు దేవాంష్ గాయపడ్డారు.

మేము సైతం..!



విజయవాడ వరద ప్రాంతాల్లో విద్యుత్ పునరుద్ధరణ పనుల్లో ట్రాన్స్‌కో ఉద్యోగులు



కృష్ణలంక వద్ద పనులు చేస్తున్న జిల్లా కార్మికులు

చిత్తూరు అర్బన్: విజయవాడలోని వరద తాకిడికి గురైన ప్రాంతాల్లో సహాయక చర్యల కోసం జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో పారిశుద్ధ్య కార్మికులు తరలి వెళ్లారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ నుంచి 75 మంది, తిరుపతి 50, పలమనేరు, పుంగనూరు మునిసిపాలిటీల నుంచి 40 మంది, శ్రీకాళహస్తిలో 30, సూళ్లూరుపేట 20, మంది చొప్పున పారిశుద్ధ్య కార్మికులు విజయవాడకు వెళ్లి నాలుగు రోజులుగా అక్కడే విధులు నిర్వర్తిస్తున్నారు. విజయవాడలోని బుడమేరు, వాంబే కాలనీ, పెనుమూడి, కొల్లూరు, రేపల్లె, భట్టిప్రోలు, కృష్ణ లంక గ్రామాలు, ఇందిరా నాయక్ నగర్ ప్రాంతాల్లో వరద తగ్గుముఖం పట్టింది. కనుచూపు మేరా ఎటు చూసినా బురద పేరుకుపోయింది. కొన్ని చోట్ల పారిశుద్ధ్యం అధ్వానంగా తయారైంది. కార్మికులు ఎక్కడికక్కడ బురద తొలగింపు పనుల్లో నిమగ్నమయ్యారు. అలాగే చిత్తూరు కార్పొరేషన్ కమిషనర్ నరసింహ ప్రసాద్, పలమనేరు కమిషనర్ రమణారెడ్డి, పుత్తూరు, నాయుడుపేట కమిషనర్లు కేఎల్ఎన్ రెడ్డి, జనార్దన్‌రెడ్డితో పాటు సచివాలయాల కార్యదర్శులు, మేస్త్రీలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పనులను పర్యవేక్షిస్తున్నారు.

ట్రాన్స్‌కో ఉద్యోగులు సైతం

ఇక అంధకారంలో ఉన్న పలు కాలనీల్లో దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థ పునరుద్ధణ పనుల్లో జిల్లా నుంచి నలుగురు ట్రాన్స్‌కో ఈఈలు, నలుగురు డీఈలు, 13 మంది ఏఈలు, 139 మంది సిబ్బంది సేవలు అందిస్తున్నారు. విజయవాడలోని పాయకం బాడి, ఉడా కాలనీ, వాంబే కాలనీ, జక్కంపూడి, మిల్ ప్రాజెక్టు ప్రాంతం, చిట్ల నగర్, ఐఎంపీ ప్రాంతం, ఈద్గా మహల్ సబ్‌స్టేషన్ల లో మరమ్మతులు చేస్తున్నారు. కొత్తగా 40 విద్యుత్ స్తంభాలు నాటారు. మరి కొన్ని రోజుల పాటు సేవలందిస్తారు.

ఉదతా భక్తిగా..

ఇక వరద బాధితుల సహాయార్థం చిత్తూరుకు చెందిన రిటైర్డు టీచర్ పార్థసారధి నాయుడు రూ.లక్ష విరాళాన్ని జేసీ విద్యాధరికి గురువారం అందచేశారు. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ తన జీజేఎం ఛారిటబుల్ ట్రస్టు ద్వారా వరద బాధితులకు నిత్యావసర సరుకులను విజయవాడకు పంపించారు. చిత్తూరు జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ నుంచి వరద బాధితుల కోసం టాబ్లెట్లు, ఓఆర్ఎస్, ఇతర మందులతో ఉన్న వెయ్యి మెడికల్ కిట్లు, తిరుపతి నుంచి 2 వేల కిట్లు, శ్రీకాళహస్తి నుంచి 754 కిట్లకు విజయవాడకు పంపించారు. అలాగే చిత్తూరులోని సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు పది బస్తాల బియ్యాన్ని అందచేశారు. డీఆర్‌డీఏ తరఫున పదివేల ఆహార పొట్లాలు, పదివేల వాటర్ బాటిళ్లు, 20 వేల బిస్కెట్ ప్యాకెట్లను ఇప్పటికే ప్రత్యేక వాహనంలో పంపించారు.





విరాళమిస్తున్న పార్థసారథి, డ్రగ్గిస్ట్ అసోసియేషన్ వితరణ

ఇసుక తోడేళ్లు!

గంగాధరనెల్లూరు నియోజకవర్గం పాలసముద్రం మండలంలో టీడీపీ నేత షాడో ఎమ్మెల్యేగా అవతారమెత్తి చేస్తున్న అవినీతి అక్రమాలకు అడ్డే లేకుండా పోతోంది. ఇసుక, గ్రానైట్ అక్రమ రవాణాతో రూ.కోట్లు దోచుకుంటున్నాడు. అధికారం అడ్డు పెట్టుకుని ఆ నాయకుడు చేస్తున్న దందాలు మూడుపువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది.

- యథేచ్ఛగా తమిళనాడుకు అక్రమ రవాణా
- రూ.కోట్లు కొల్లగొడుతున్న షాడో ఎమ్మెల్యే
- పాలసముద్రంలో టీడీపీ నేత దందా



పాలసముద్రం మండలం వనదుర్గాపురం వద్ద భారీగా డంపు చేసిన ఇసుకను స్వాధీనం చేసుకున్న పోలీసులు

సాక్షి ప్రతినిధి, తిరుపతి: గంగాధరనెల్లూరు నియోజక వర్గానికి చెందిన టీడీపీ నాయకుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అవినీతి అక్రమ మార్గంలో సంపాదించేపనిలో నిమగ్నమయ్యారు. ప్రస్తుతం గంగాధరనెల్లూరు నియోజకవర్గానికి అన్నీ తానై వ్యవహరిస్తూ, అధికారులను బెదిరిస్తూ, తాను చెప్పిందే చేయాలి.. తనకు తెలియకుండా ఏ ఒక్క పనీ జరగడానికి వీల్లేదంటూ అధికారులకు హుకుం జారీ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి వివిధ అక్రమ మార్గాల్లో ఎలా డబ్బులు దండుకోవాలో ముక్కు పిండి వసూళ్లకు పాల్పడుతున్నాడు. ప్రధానంగా ఇసుక దోపిడీలో ఆయన అందెవేసిన చేయిగా పేరు మారుమోగిపోతోంది.

గ్రానైట్‌లోనూ దోపిడీ

గంగాధరనెల్లూరు నియోజకవర్గంలోని గ్రానైట్ సంపదను షాడో ఎమ్మెల్యే అనధికారికంగా కొల్లగొడుతూ జేబులు నింపుకుంటున్నారు. వే బిల్లులు లేకుండా గ్రానైట్ అక్రమంగా రవాణా చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. పట్టపగలే పరిమితికి మించి రవాణా చేస్తున్నా అధికారులు ప్రేక్షకపాత్ర వహిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. అంతేకాకుండా మరోవైపు ఎర్రచందనం అక్రమ రవాణాలో సైతం ఆరితేరినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇటీవల గంగాధరనెల్లూరులో అక్రమంగా ఎర్రచందనం దుంగలను తరలిస్తూ పట్టుబడినప్పటికీ రాష్ట్ర స్థాయి నాయకులు చెప్పడంతో అధికారులు వదిలిపెట్టినట్టు భోగట్టా! ముఖ్య నేత ఆదేశాల మేరకే ఎర్రచందనం, ఇసుక దంపుచేసి రాత్రికి రాత్రే తరలిస్తున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. షాడో ఎమ్మెల్యేకు రాష్ట్ర స్థాయి నాయకుల అండదండలు పుష్కలంగా ఉండటంతో విచ్చలవిడిగా అక్రమాలకు పాల్పడుతున్నారనే చర్చ జరుగుతోంది. పనిలో పనిగా షాడో ఎమ్మెల్యే అనుచరులు కూడా అక్రమ కార్యకలాపాలు కొనసాగిస్తూ, దందాలు చేస్తున్నా, ఏ ఒక్క అధికారి వారి వైపు కన్నెత్తిచూడడం లేదని టీడీపీ నేతలే ఆరోపిస్తున్నారు. అధికారుల బదిలీల్లోనూ ఆయన తన చేతివాటాన్ని ప్రదర్శిస్తూ వసూళ్లకు పాల్పడుతుండటం గమనార్హం!

చిత్తూరు టు చెన్నై

చిత్తూరు మండలం అనంతాపురం రీచ్ నుంచి ఇసుక అక్రమ తవ్వకాలు జోరుగా జరుగుతున్నాయి. టీడీపీ నాయకులు, ఓ మాజీ ఎంపీపీ భర్త లారీలు, టిప్పర్లతో ఇసుకను కొల్ల గొడుతున్నారు. ఈ రీచ్ తమిళనాడు సరిహద్దులో ఉండడంతో టీడీపీ నేతలు 'మూడు ట్రాక్టర్లు..ఆరు టిప్పర్లు' అన్న చందాన అక్రమంగా సంపాదిస్తున్నారు. అది కూడా పగలంతా ప్రబుద్ధుల్లా ఉంటారు. చీకటి పడితే చాలు దందాకు తెరతీస్తున్నారు. ఈ రీచ్ నుంచి రోజూ 20 నుంచి 30 టిప్పర్ల వరకు ఇసుకను తరలిస్తున్నారు. ఒక టిప్పర్ రూ.50 వేల నుంచి రూ. 1.20 లక్ష వరకు, ట్రాక్టర్ రూ.3 వేల నుంచి రూ.10 వేల వరకు అమ్ముకున్నట్లు టీడీపీ శ్రేణులే బహిరంగంగా చెబుతున్నాయి. ఇసుక అక్రమ రవాణాపై టీడీపీ శ్రేణులే చిత్తూరు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేయటం కొసమెరుపు.

తమిళనాడుకు ఇసుక అక్రమ రవాణా

పాలసముద్రం మండలం నుంచి నిత్యం ఇసుక టిప్పర్లలో తమిళనాడుకు తరలిస్తున్నారు. ప్రతి రోజూ రాత్రి పూట కాలువలు, వాగుల వద్ద నుంచి ఇసుకను తవ్వి పలు ప్రాంతాల్లో డంప్ చేస్తాడు. ఆ తరువాత వాహనాల్లో తమిళనాడు రాష్ట్రానికి తరలించి రూ. కోట్లు దండుకుంటున్నాడు. రోజూ వందల సంఖ్యలో టిప్పర్ల ద్వారా యథేచ్ఛగా అక్రమంగా తరలిస్తున్న విషయం తెలిసినా అధికారులు మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. అక్రమ రవాణాలో కొందరు అధికారులకు కూడా వాటా ఉన్నట్లు ప్రచారంలోకి వచ్చింది. కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం అని చెబుతున్నా ఇక్కడ టీడీపీ నేతలకు జేబులు నింపుతోంది. బినామీలతో ఇక్కడ నుంచి చెన్నైకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. నియోజకవర్గంలో షాడో ఎమ్మెల్యేగా వ్యవహరిస్తూ తనకంటూ ఓ వర్గాన్ని తయారు చేసుకుని అక్రమార్జనే లక్ష్యంగా అక్రమాలకు పాల్పడుతున్నారు. ఇటీవల కాలంలో సుమారు 500 టిప్పర్లతో వేలాది టన్నుల ఇసుకను రవాణా చేసి రూ. 5 కోట్లు సంపాదించినట్లు ప్రచారం జరుగుతోంది.



రాత్రికి రాత్రే దాడి పోలీసులు దాడులు చేసి స్వాధీనం చేసుకున్న ఇసుక డంప్



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇసుక డంప్